
# జనపదం

J A N A P A D H A M

హైదరాబాద్ | మంగళవారం 25 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 107

తెలుగు దినపత్రిక


## మూడు రోజులు.. కీలక ఒప్పందాలు..



- ముగిసిన మోదీ అమెరికా టూర్..
- సాయుధ డ్రోన్‌ల కొనుగోలుపై బైడెన్ తో చర్చలు ఒకే..
- ఇండో- పసిఫిక్ శాంతి కోసం సమష్టి కృషికి నిర్ణయం..
- క్వాడ్ సమ్మిట్ లో ఆస్ట్రేలియా, జపాన్ తో ద్వైపాక్షిక చర్చలు..

2



## అక్టోబర్ 16న విచారణకు రండి..

సీఎం రేవంత్ రెడ్డికి నాంపల్లి కోర్టు ఆదేశాలు

ఓటుకు నోటు కేసులో తాజా ఉత్తర్వులు..

ప్రతి సందర్భంలో మత్తయ్య తప్ప అందరూ గైర్హాజరే..

3



## విచారణ వేగిరం...

కాళేశ్వరంపై పట్టు సాధిస్తున్న కమిషన్..

ఎంక్వైరీకి హాజరైన తాజా మాజీ ఇంజినీర్లు...

వివరాలు తెలియజేసిన ఐదుగురు ఎగ్జిక్యూటివ్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు..

అనుమతి లేకుండా బ్యాంక్ గ్యారంటీ ఇచ్చినట్టు అంగీకారం..

ఇప్పటికే కీలక సమాచారం సేకరణ..

అధికారుల తీరుపై మందలించిన కమిషనర్...

3





# గూడు చెదిరే.. గుండె కరిగే... ఆగని కూల్చుడు...

## హైడ్రా బరితెగింపు..

- కొంపలు కూల్చుడే పనిగా దూకుడు...
- సామాన్యుడి అంతు చూస్తున్న కమిషన్...
- ఆజ్యం పోస్తున్న రాష్ట్ర సర్కార్..
- హైదరాబాద్ ప్రజలపై ప్రభుత్వ కత్తి..
- విచ్చలవిడి నిర్ణయాలతో జనజీవనం అస్తవ్యస్తం..
- చెట్టుకొకరు పుట్టకొకరుగా విలపిస్తున్న ప్రజలు..
- తాజాగా మూసీలో 16 వేల ఇళ్ల కూల్చివేత..?
- నిన్న ఇబ్రహీం పట్నంలో 500 కూల్చివేతలు..

**హైడ్రా బరితెగించింది. కూల్చుడే పనిగా, నేలమట్టం చేయడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న తీరుగా వ్యవహరిస్తున్నది. అందునా సామాన్యుడు ఏడుస్తుంటే సరదాగా చూడాలనే పైశాచిక ఆనందం పొందుతున్నది. బడా బాబుల జోలికి వెళ్లడానికి నత్తనడకన సాగుతున్న యంత్రాలు., నిరుపేదల గూడు కూల్చడానికి మాత్రం జెట్ స్పీడ్ లో దూసుకెళ్తున్నాయి. రోజుకో ఏరియాలో వేల సంఖ్యలో ఇండ్లను నేలమట్టం చేస్తూ గుండెలు పగులగొడుతున్నాయి. గూడు చెదిరిన బీద పక్షులు నెత్తినోరు కొట్టుకుంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తుంటే తమకేమీ పట్టనట్టుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తుండగా, జీవితాలు తారుమారై భార్యబిడ్డలతో రోడ్డున పడ్డ కుటుంబాలు తలదాచుకోవడానికి చోటెక్కడ దొరుకుతుందో తెలియక కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దుర్గం చెరువులో కూల్చివేతలకు ముహూర్తం అడ్డొస్తున్నట్టుగా వెనుదిరిగిన బుల్డోజర్లకు మూసీ వెంట, ఇబ్రహీం పట్నంలో బీదవాడి కొంపలు కూల్చడానికి మాత్రం ఏ అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోయాయి. హైడ్రా కమిషనర్ కూడా పెద్దోళ్లను పట్టించుకోకుండా, పేదలపైనే ప్రతాపం చూపుతూ ఎక్కడ లేని న్యాయం చేస్తున్నట్టుగా ఫోజు కొడుతున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. సొంతింటి కల సాకారం చేసుకునే బీదలకు లోన్లు ఇవ్వొద్దనే ఉచిత సలహాలు ఇస్తూ ఆయన ప్రదర్శిస్తున్న పెద్దరికాన్ని పలువురు మరింత విచిత్రంగా చెప్పుకుంటున్నారు.**



### హైడ్రా తీరుపై సీఎం అత్యవసర సమావేశం...

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి..

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు జరపాలని ఆదేశాలు..

జనపదం, బ్యూరో

రెక్కలు ముక్కలు చేసుకుని, పైసాపైసా పోగేసుకున్న కష్టంతో కట్టుకున్న కలల సౌధం కళ్ల ముందే కూల్చుతుంటే., అప్పటి వరకు తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో సంతోషంగా గడిపిన మధుర క్షణాలను బుల్డోజర్ల రూపంలో వచ్చిన కింకరులు దూరం చేస్తూ.., ప్రాణంగా, పెద్దల గుర్తులకు నిలయంగా భావించిన కొంపలను ఆనవాళ్లు కూడా లేకుండా నేలమట్టం చేస్తే.., ఆ కష్టం పగోడికి కూడా రావొద్దు., అలాంటి పరిస్థితి మరే మనిషికి కలుగొద్దు. కానీ, హైడ్రా సాగిస్తున్న విశృంఖల పర్వంలో హైదరాబాద్ లో చిరు కొంపల్లో కాపురం వెళ్లదీస్తున్నవారు వణికిపోతున్నారు. తెలిసీ తెలియక, ఓ నాలుగు తక్కువ డబ్బులకు జాగాలు వస్తున్నాయని ఆశతో కొనుక్కున్న స్థలాల్లో కష్టంతో కట్టుకున్న ఇండ్లను హైడ్రా అధికారులు కూలగొడ్తుంటే ఏమీ చేయలేక నిస్సహాయంగా చూస్తుండి పోతున్నారు. తమకు కాస్త సమయమివ్వండి, మీకు శ్రమ లేకుండానే పని పూర్తి చేసుకుంటాం.. అని కాళ్లవేళ్లా పడి బతిమిలాడినా కనికరించకుండా ఏదో సాధించిన వారి మాదిరిగా యంత్రాంగం సాగిస్తున్న దమన నీతి కూల్చివేతలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి.

**బరితెగింపు..**

బరితెగించిన హైడ్రా ......(తరువాయి 2లో)


## పురుగు మెసులుతాందా..?



- కమిషన్ తీరుపై కేటీఆర్ ఫైర్..
- సామాన్యుడికి సమయమివ్వరు..,
- బంధుప్రీతికి మాత్రం దాటవేత ధోరణి..
- న్యాయం ఉన్నోరి చుట్టమా.. అని మండిపాటు..
- తప్పెవరిది.., శిక్ష ఎవరికి అని ప్రశ్న..

2

## కమిషన్ పైశాచికం..?



- బ్యాంకర్లతో కమిషనర్ రంగనాథ్ సమావేశం..
- లోన్లు ఇవ్వొద్దని ఆదేశాలు..
- కూల్చడానికి మరిన్ని బుల్డోజర్లకు ఇండెంట్..

# అంతా బీసీ జపం..

## బీసీ మంత్ర.. పొలిటికల్ తంత్ర..



### ముందే ఎత్తుకున్న బీజేపీ..

### వెంటనే అందుకున్న బీఆర్ఎస్..

తప్పదన్నట్టుగా చేబట్టిన కాంగ్రెస్..

రాజకీయాల్లో కొత్త పీఠిక..

వెనకబడిన వ్యూహానికి కొత్త సొబగులు..

పార్టీలకు అతీతంగా ఒక్కటవుతున్న నేతలు..

జనపదం, బ్యూరో:

అంతా బీసీమయం. అన్ని పార్టీల వ్యూహం 'వెనకబాటు'ను భుజానికెత్తుకోవాల్సిన తరుణం. అగ్రకులాల ఆధిపత్యాన్ని ఇక సహించేది లేదని ఆయా పార్టీల్లోని బీసీ నేతలు బహిరంగంగానే అస్త్రాలు ఎక్కుపెడుతుండడంతో రాష్ట్రమంతా బీసీ జపం సాగుతున్నది. అధికార కాంగ్రెస్ ఎన్నికల హామీపై కాస్త నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును ఆ పార్టీలోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఇతర నాయకులు బహిరంగంగానే విమర్శించడంతో కాక మొదలైంది. తెలంగాణ రాష్ట్రానికి చివరి ఓసీ సీఎం రేవంత్ అంటూ మొన్నటి మీటింగ్ లో ప్రకటించిన తీరు అందరిలో వణుకు పుట్టించిందనే చెప్పాలి. అధికారంలో ఉన్న పార్టీలోనే ఇంతటి ప్రత్యక్ష హెచ్చరికను కలలో కూడా ఊహించని అగ్రకులాల పెద్దలు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారనే చెప్పాలి. పైగా అధిష్టానం కూడా తన చూపును రాష్ట్రంలో సర్కార్ ఐదేళ్లు సాఫీగా సాగేలా చూడడంతో పాటు బీసీ జనాలను దూరం చేసుకోకుండా పార్టీని కాపాడుకోవాలనే ముందు చూపుతో ఉండడంతో చేసేదేమీ లేక అంతా గమనిస్తున్న విచిత్రం.

**ముందే ఎత్తుకున్న బీజేపీ..**

2023 అసెంబ్లీ ఎన్నికల వేళలోనే భారతీయ జనతాపార్టీ బీసీ ముఖ్యమంత్రి అంటూ ప్రజల్లోకి వెళ్లింది. తమ పార్టీ ముమ్మాటికి బీసీ నేతనే సీఎంను చేస్తుందని, అధిపత్యం చేయాల్సిన ప్రజలు అగ్రవర్ణాల పాలనలో గులాంగిరి పడాల్సిన అవసరం ఏముందని డైరెక్ట్ గా ప్రశ్నించింది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లలో బీసీలు ముఖ్యమంత్రిగా పట్టం ఎక్కిన సందర్భాలు ఎన్ని ఉన్నాయో ఎవరికి వారుగా మననం చేసుకోవాలని ప్రజలను చైతన్యం చేసింది. బీసీ నేతలైన బండి సంజయ్, ఈటల రాజేందర్ వంటి వారిని ముఖ్యమంత్రిని చేసి పాలనను ప్రజలకు చేరువ చేస్తామని బీజేపీ చేసిన ప్రకటనతో ఇతర పార్టీల్లో ఓ సురుకు పుట్టించినట్టు అయింది. ఎన్నిటికైనా బీసీ ముఖ్యమంత్రి కేవలం కమలం పార్టీతోనే సాధ్యమని స్వయంగా ప్రధాని మోదీ బహిరంగ సభల్లోనే ప్రకటించడంతో రాష్ట్రంలో బీసీలకు మంచిరోజులు రాబోతున్నాయనే సంకేతాలు విడుదలయ్యాయి. దేశం మొత్తంగా ఓబీసీ కి బీజేపీ ప్లాన్ చేస్తూ తన రాజకీయవ్యూహాన్ని పదును పెడుతూనే ఉంది.


**వెంటనే అందుకున్న బీఆర్ఎస్..**

బీజేపీ బీసీ నినాదాన్ని వెంటనే అందిపుచ్చుకుని ఏ మాత్రం ఆలస్యం చేసినా పార్టీకి నష్టం వస్తుందని గమనించి బీఆర్ఎస్ కూడా ఓ ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్లడానికి సంకల్పించింది. ఈ క్రమంలోనే మాజీ స్పీకర్ మధుసూదనాచారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. బీసీ కులగణన ఆవశ్యకత, రాజకీయంగా ......(తరువాయి 4లో)

## కృష్ణయ్య రాజీనామా..

- రాజ్యసభ ఎంపీ పదవికి రిజైన్..
- ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నేత..
- తాజా ఘటనతో ఎనిమిదికి పడిపోయిన వైసీపీ బలం..
- రాజీనామాను ఆమోదిస్తున్నట్టు ప్రకటించిన చైర్మన్
- తెలంగాణలో బీసీ ఉద్యమం బలోపేతం కోసమే అని ప్రకటన..

2



# తెరపైకి ట్యాపింగ్..

- ప్రత్యేక బృందంతో విచారణ
- హైదరాబాద్ సీపీ, వెస్ట్ జోన్ డీసీపీతో ఎంక్వైరీ..
- ప్రభాకర్ రావు, శ్రవణ్‌కు రెడ్ కార్నర్ నోటీస్ పై ఇంటర్ పోల్‌కి లేఖ
- డీజీపీ జితేందర్ రెడ్డి




జనపదం, హైదరాబాద్ సిటీ :

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేస్తోందని డీజీపీ జితేందర్ చెప్పారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్, పశ్చిమ మండల డీసీపీ విచారణ చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో మీడియాతో డీజీపీ జితేందర్ మాట్లాడారు.. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న స్టేట్ ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు , ఓ ఛానల్ ఎండీ శ్రవణ్ రావులను విదేశాల నుంచి ఇండియాకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. వీరిద్దరికీ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతోన్నాయని ఆయన స్పష్టం చేశారు. రెడ్ కార్నర్ నోటీస్ ప్రస్తుతం సీబీఐ వద్ద ప్రాసెసింగ్ లో ఉందన్నారు. రెడ్ కార్నర్ నోటీస్ అనేది చాలా పెద్ద ప్రొసీజర్ అని, ఇంటర్నేషనల్ ఏజెన్సీలతో కలిసి పనిచేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఈ క్రమంలో నిందితులకు రెడ్ కార్నర్ నోటీస్ ఇష్యూ చేసేందుకు ఇంకొంత సమయం పడుతోందని తెలిపారు.

**తెలంగాణలో మావోయిస్టు ప్రాబల్యం లేదు**

తెలంగాణలో మావోయిస్టు ప్రాబల్యం లేదని డీజీపీ జితేందర్ రెడ్డి చెప్పారు. తెలంగాణ చుట్టుపక్కల రాష్ట్రాలలో మావోయిస్టుల ప్రభావం ఉందని, అయితే మన రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాల కట్టడికి పూర్తిస్థాయిలో పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇదిలావుండగా, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జైనూర్ లో ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచార ఘటన దురదుష్టకరం అని డీజీపీ జితేందర్ తెలిపారు. ఈ కేసులో 38 మందిని అరెస్ట్ చేశామన్నారు. అక్కడ పరిస్థితులు చేయి దాటి పోవడంతో పలువురిని అరెస్ట్ చేశామన్నారు. అక్కడ అలసత్వం ......(తరువాయి 4లో)



# మాట నిలుపుకోండి..

- ఆర్ఆర్ఆర్ పై హామీని నెరవేర్చండి..
- మాట మార్చుడు.. మభ్య పెట్టుడే కాంగ్రెస్ విధానమా..?
- కోమటి రెడ్డికి మతి మరుపు ఎక్కువైనట్టుంది..
- మాజీ మంత్రి హరీష్ రావు
- త్రిపుల్ఆర్ బాధితుల పక్షాన పోరాడుతామని హామీ..
- తమకు బాసటగా ఉండాలని వేడుకున్న బాధితులు..

3

## కొలువుల కాలేజీలు..!



- నిరుద్యోగులకు సర్కార్ తీపికబురు
- 38 కాలేజీల్లో జాబ్ గ్యారంటీ కోర్సులు
- డిగ్రీతో పాటు సరికొత్తగా నైపుణ్య డిగ్రీ
- ఆన్ లైన్ పోర్టల్ లో 10వేల స్టూడెంట్స్ వివరాలు
- ఇకపై క్యాంపస్ సెలక్షన్ల మాదిరిగా ఆన్ లైన్ ఉద్యోగ ఎంపికలు
- దేశంలోనే వినూత్న ప్రయోగానికి శ్రీకారం

4

## బ్యాడ్ లక్ సిద్ధప్పా..

- కర్నాటక సీఎంకు చుక్కెదురు..
- ముడా విచారణకు హాజరుకావాల్సిందే అని తేల్చిన హైకోర్టు
- గవర్నర్ నిర్ణయంలో తప్పులేదన్న న్యాయస్థానం..

4



# శ్రీధర్ బాబు తెలివి ప్రదర్శిస్తున్నాడు

- మాజీ మంత్రి హరీశ్ రావు



**జనపదం, బ్యూరో:** కాంగ్రెస్ సర్కార్ ఫిరాయింపులపై బద లాయింపులు మానుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు సూచించారు. అబద్దం అతికేటట్టు ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు తెలుసుకోవాలని, ఫిరాయింపులపై ఆయన తెలివితేటలు ప్రదర్శిస్తున్నారంటూ విమర్శిం చారు. మర్యాదపూర్వకంగా అయితే సీఎంను పార్టీ మీటింగ్ లో కలుస్తారా..? అరికెపూడి గాంధీ సొంత నియోజకవర్గానికి సీఎం వస్తే.. ప్రకాష్ గౌడ్ ఎందుకొ చ్చినట్లు.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నీతిని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ కు శిక్ష తప్పదని హెచ్చరించారు.

## పోలీసులపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

### ఏపీ తరహా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

పోలీసులకు మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్ అయ్యారు. ఎప్పటికీ ఒకే రోజులు ఉండవని, చట్టాలకు లోబడి మాత్రమే పోలీసులు పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన హరీష్ రావు ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని గుర్తు చేశారు. ఏపీలో ఏమైందో పోలీస్ అధి కారులు గుర్తుంచుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొందరు పోలీస్ అధికా రులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, ఏపీ తరహా పరిణామాలు ఎదుర్కోవడానికి సిద్ధం ఉండాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ క్యాడర్ పై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని, తొత్తులుగా వ్యవహరించే పోలీసులు తీరు మార్చుకోవాలన్నారు. రేవంత్ హయాం లో గుండాయిజం పెరిగిపోయిందని, అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయని ఆరోపిం చారు. తొమ్మిది నెలల కాలంలో రెండు వేల అత్యాచారాలు జరిగాయని చెప్పారు. సునీత లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెట్టాలని డీజీపీని డిమాండ్ చేశారు.

## తిరుమల లడ్డూ లొల్లి..

### సిట్ చీఫ్‌గా సర్వశ్రేష్ఠ త్రిపాఠి నియామకం



**జనపదం, తిరుపతి:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ చీఫ్‌గా నియమించింది. 2006 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి త్రిపాఠి, గతంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎస్పీగా పని చేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో గుంటూరు రేంజ్ ఐజీగా పని చేస్తున్న పాలరాజుని ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఆయన స్థానంలో త్రిపాఠిని ఈసీ నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనే ఐజీగా కొనసాగుతు న్నారు. ప్రస్తుతం తిరుమల వెంకన్న లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ వ్యవహా రంతో పాటు, తిరుమలలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు సిట్ చీఫ్‌గా సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించింది.

## రాజ్యసభ ఎంపీ పదవికి ఆర్. కృష్ణయ్య రాజీనామా

### తెలంగాణలో బీసీ ఉద్యమం బలోపేతం కోసమే..



**జనపదం, బ్యూరో:** రాజ్యసభ ఎంపీ పదవికి ఆర్. కృష్ణయ్య రాజీనామా చేశారు. కృష్ణయ్య రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ ఆమోదిం చారు. కృష్ణయ్య రాజీనామాతో రాజ్యసభలో ఆయన స్థానం ఖాళీ అయినట్లు రాజ్యసభ సెక్ర టేరియేట్ మంగళవారం నాడు నోటిపై చేసింది. బీసీ సంఘం జాతీయ నేతగా ఉన్న ఆర్. కృష్ణయ్య ఆంధ్రప్రదేశ్ నుంచి వైఎస్ ఆర్ సీపీ పార్టీ తరపున రాజ్యసభకు ప్రాతినిథ్యం వహించారు. పదవీ కాలం ఇంకా నాలుగేళ్ళు ఉండగానే ఆర్. కృష్ణయ్య రాజీనామా చేశారు. తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కొన్ని అడ్డంకులు ఉన్నాయని, అందుకే ఎంపీ పదవికీ రాజీనామా చేసినట్లు ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఏపీకి సంబంధించి రాజ్యసభలో మొత్తం 11 స్థానాలు ఉన్నాయి. అయితే ఇటీవల రాజ్యసభ సభ్యత్వాలకు బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకట రమణ రాజీనామా చేశారు. తాజాగా ఆర్. కృష్ణయ్య రాజీనామా చేయడంతో ఆ పార్టీ రాజ్యసభ ఎంపీల సంఖ్య ఎనిమిదికి పడిపోయింది.

# ఆగని కూల్చుడు...



(మొదటిపేజీ తరువాయి) కూల్చివేతల్లో దూసుకెళ్తున్నది. టార్గెట్ పెట్టుకున్న సంస్థ మాదిరిగా అత్యంత వేగంగా నేలమట్టం చేయడంపై దృష్టి సారించి సాగుతున్నది. ఎక్కడికక్కడ ఇండ్లను కూలగొడుతూ పేద ప్రజలను రోడ్డుపై పడేస్తున్నది. గూడు చెదిరిన జనం గుండెలు పగిలి చస్తుంటే తమకేమీ పట్టనట్టుగా ముందుకెళ్తున్నది. హైడ్రా కమిషన్ కు సర్కార్ మరింత వెన్ను దన్నుగా నిలుస్తూ గో ఏ హెడ్.. అన్నంత స్వతంత్రాన్ని ఇచ్చి వేడుక చూస్తున్న సందర్భంలో తమను ఎందుకు ఇలా చేస్తున్నారో., తాము చేసిన తప్పేంటో అర్థం గాక బాధితులు లబోదిబోమంటున్నారు. దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్ గా చెప్పుకుం టున్న జీవితానికి ఇప్పుడు కేరాఫ్ ఫుట్ పాత్ అనేలా చేస్తున్న యంత్రాంగాన్ని ఏమీ చేయలేక, కడుపులో యతను ఆపుకోలేక శాపనార్థాలతో సరిపెట్టుకుంటున్నారు.

### తాజాగా మూసీలో 1600 ఇళ్ల కూల్చివేత..?

మూసీ పరివాహకంలోని 1600 ఇండ్లను కూల్చివేయాలని హైడ్రా నిర్ధారించుకున్నది. ఇప్పటికై స్పష్టమైన విధివిధానాలను రూపొందించుకుని పకడ్బందీ వ్యూహంతో ముందుకు పోతున్నది. ప్రజల నుంచి వ్యతిరేక పెరుగుతున్న నేపథ్యంలో పనిని త్వరగా పూర్తి చేయడానికి కావాల్సిన యం త్రాలను భారీగా తెప్పించుకోవడానికి ఇం డెంట్ కూడా సిద్ధం చేసుకున్నది. తక్కువ సమయంలో ఎక్కువ వర్క్ చేసి, వ్యతిరేక పెల్లుబికకముందే అక్కడ నుంచి విజయగ ర్వంతోవెనుదిరగాలనే ఎంతో ముందు చూపుతో బుల్డోజర్ల సంఖ్యను అమాంతంగా పెంచడానికి నిర్ణయం తీసుకుని సర్కార్ కు నివేదించుకున్నది. ఉత్తరప్రదేశ్ లోని యోగి సర్కార్ డోజర్ల మాదిరిగా చేపట్టిన కార్యాన్ని మరపించేలా హైడ్రా రాష్ట్ర చరిత్రలో యంత్ర కూల్చివేతలకు శ్రీకారం చుట్టి చరిత్ర సృష్టించే దిశగా ముందుకెళ్తున్నది. **అలాగే రెండు** రోజుల కిందట ఇబ్రహీం పట్నం పరిసరాల్లో సుమారు ఐదు వంద లకు పైగా ఇండ్లను నేలమట్టం చేశారు. హైడ్రా దూకు డుతో ఒక్కసారిగా పరిస్థితి అర్థం గాక జనం విస్తుపోయి చూ స్తుండగానే తనపనిన తాను పూర్తి చేసుకుని అధికారులు వెనుదిరిగారు. వందల సంఖ్యలో ఇండ్లు నేలమట్టం కావడంతో ఆడవారు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకానొక సంద ర్భంలో ఓ గర్భిణీ కనీసం ఇంటి నుం చి బయటకు వచ్చేంత వరకు కూడా ఆగలే నంత బిజీగా యంత్రాంగం తన ప్రతాపాన్ని ప్రదర్శించి పైశాచికత్వాన్ని చూ పింది. హైడ్రా పైశాచికత్వం ప్రదర్శిస్తున్నది. ఉన్న వారిని చూసీ చూడనట్టుగా, పేదలంటే మాత్రం ఎక్కడలేని శక్తిని కూడగట్టుకున్న దాని మాదిరిగా రెచ్చిపోతున్న తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది. నిత్యం ఏదో ఓ ఏరియాలో కూల్చివేతలే పనిగా, పగబట్టిన వాడిగా సాగుతున్న తీరుపై సర్వాత్రా ఆందోళన వ్యక్తమవుతున్నాయి.

# కమిషన్ పైశాచికం..?

- బ్యాంకర్లతో కమిషనర్ రంగనాథ్ సమావేశం..
- లోన్లు ఇవ్వొద్దని ఆదేశాలు..
- కూల్చడానికి మరిన్ని బుల్డోజర్లకు ఇండెంట్..



హైడ్రా కమిషన్ రంగనాథ్ వ్యవహారం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. పేదలపై చూపుతున్న అక్కసు ఉన్న వారిపై చూపడం లేదని పెద్దఎత్తున అసంతృప్తులు చెలరేగుతున్నాయి. ఒక్క ఎన్ కన్వెన్షన్ కూల్చడం తప్ప ఇప్పటి వరకు ఆయన కూల్చిన బడాబాబుల కట్టడాలు ఏమీ లేవని గుర్తు చేస్తున్నారు. పేదలకు కోర్టుకెళ్లి న్యాయం కోరే అవకాశం కూడా ఇవ్వకపోగా, కోర్టుకె ల్లారని తెలిస్తే చాలు వెంటవెంటనే కూల్చివేతలు చేస్తున్న ఆయన, దుర్గం చెరువులోని పెద్ద తలల కట్టడాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని బడా నిర్మాణాలకు మాత్రం తీవ్ర వెసలుబాటు కల్పించేలా నడుచుకుంటున్న తీరును దుయ్యబడుతున్నారు. మరికొందరైతే కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేది., రేవంత్ ను గెలిపిస్తే తగిన గుణపాఠమే చెబుతున్నాడని బహిరంగంగానే తిట్టిపోస్తున్నారు. ఈ క్రమంలోనే రంగనాథ్ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి నిర్మాణాలకు లోన్లు ఇవ్వొద్దని చెబుతున్న తీరును అంతా దుయ్యబడుతున్నారు. పేదలకు మంచి చేయాల్సిందిపోయి తన వంతుగా గూడులు చెదిరిపోయేలా సలహాలు, సూచనలు చేస్తున్న రంగనాథ్ తీరును పైశా చికంగా పేర్కొంటున్న మట్టికొట్టుకుపోతావని శాపనార్థాలు పెట్టేలా చేసుకుంటున్నారు. సీఎం రేవంత్ కూడా తమ ఉసురుతాకిపోతాడని, హైడ్రా కూడా తప్పకుండా మట్టికొట్టుకు పోతుందని పలువురు మీడియా ముఖంగానే దుమ్మెత్తిపోస్తున్నారు. అదీ చాలదన్నట్టుగా మరిన్ని బుల్డోజర్లు కావాలని ఇండెంట్ పెడుతున్న తీరుపై జనమంతా కోపోద్రిక్తులవుతు న్నారు. కట్టడాలు నిలబెట్టాల్సిన సర్కార్ కూల్చివేతలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న తీరును కనివిని ఎరుగమేమో అని ఆశ్చర్యాన్ని కూడా వ్యక్తం చేస్తూ, ఆవేదన చెందుతున్నారు.

## బాధితులకు న్యాయం జరగాలి..

- సీఎం అత్యవసర మీటింగ్..
- అధికారులకు దిశానిర్దేశం..



**జనపదం, హైదరాబాద్:** చెరువులు, నాలాల ఆక్ర మణల తొలగింపు విషయంలో అధికారు లకు సీఎం కీలక ఆదే శాలు జారీ చేశారు. ఆక్రమిత చెరువులు, నాలాలతో పాటు మూసీ పరివాహక ప్రాంతాల పరిధిలో నివసించే అర్హులైన పేదల వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపి వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలన్నారు. ఔటర్ లోపల ఉన్న చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షించేం దుకు చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

### నిర్వాసితులకు న్యాయం దిశగా..

అందులో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు 16 వేల 2 బీహెచ్ కే గృహాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ బెడ్ (నదీ గర్భం), బఫర్ జోన్ లో ఉన్న నిర్మాణాలకు పునరావాసం కల్పించేందుకు వీటిని ఉపయోగిస్తారు. ఇప్పటికే అధికారులు చేపట్టిన సర్వే ప్రకారం 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు రేపు ఇంటింటికి వెళ్లి అక్కడున్న ప్రజలకు ఎక్క డెక్కడ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను కేటాయించారో తెలియజేస్తారు. ముందుగా రివర్ బెడ్ లో ఆక్రమణలో ఉన్న 1600 ఇళ్లను తొలగించి అక్కడ ఉన్న వారిని తరలిస్తారు. మూసీ బఫర్ జోన్ లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తారు, నిర్మాణ ఖర్చు తో పాటు, వారికి పట్టా ఉంటే భూమి విలువను పరిహారంగా చెల్లిస్తారు. 2 బీహెచ్ కే ఇల్లు కూడా కేటాయిస్తారు. మూసీ బాధిత ప్రజలందరికీ చట్ట ప్రకారం పునరా వాసం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే భరోసా ఇచ్చారు.

# పురుగు మెసులుతాందా..?

- కమిషన్ తీరుపై కేటీఆర్ ఫైర్..
- సామాన్యుడికి సమయమివ్వరు
- బంధుప్రీతికి మాత్రం దాటవేత ధోరణి..
- న్యాయం ఉన్నోరి చుట్టమా.. అని మండిపాటు..
- తప్పెవరిది.., శిక్ష ఎవరికి అని ప్రశ్న..



**జనపదం, బ్యూరో:** పేదళ్ల గూడు కూల్చుతు న్నారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ మండి పడ్డారు. గరీబోళ్లకు ఒక న్యాయం, సీఎం అన్న తిరుపతి రెడ్డికి ఇంకో న్యాయమా అని.., సీఎం కు మెదట్లో పురుగు మెసులు తోందని ఎద్దేవా చేశారు. దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వాళ్లపై చర్యలు తీసుకోవా లని, హైదరాబాద్ లో అక్రమంగా పర్మిషన్ ఇచ్చిందే కాంగ్రెస్ కాదా.. అన్నారు. పేదవాళ్ల ఇళ్లను కూల్చేస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదని, వారికి అండగా ఉంటుంద న్నారు. రేవంత్ రెడ్డి కుటుంబం రాష్ట్రాన్ని పంచుకొని స్వైర విహారం చేస్తూ దోచుకుం టుదని, మాదాపూర్ లో తిరుపతి రెడ్డి కమీషన్ల దుకాణం తెరిచిందని శేరిలింగం పల్లి ఎమ్మెల్యేనే చెప్పిందని గుర్తు చేశారు.

### కోపంతోనే ఇదంతా..

హైదరాబాద్ లో బీఆర్ఎస్ భారీ మెజార్టీల తో క్లీన్ స్వీప్ చేసిందని, కాంగ్రెస్ కు ఓటు వేయలేదని ప్రజలపై పగ బట్టి సర్కార్ ఇ లాంటి చర్యలకు దిగుతోందన్నారు. ఆటో డ్రైవర్లు, బస్తీ వాసులు, పేదలపై సీఎం కక్ష పెంచుకున్నాడని, అందుకే తన అన్నకు ఓ న్యాయం, గరీబోళ్లకు మరో న్యాయం పాటి స్తున్నారన్నారు. బీఆర్ఎసోళ్లు అడుగుతున్నా రంటూ ఒక నోటీసు డ్రామా చేసి స్టే తెచ్చు కునేటట్టు దుయ్యబట్టారు. గరీబోళ్లు పుస్తకా లు, సామాన్లు తీసుకుంటామంటే కూడా సమయం ఇవ్వని హైడ్రా, సీఎం సోదరుడికి మాత్రం ఏమీ చేయలేక వెనుదిరిగిందన్నా రు. హైడ్రాకు చుట్టం లేకపోతే తిరుపతి రెడ్డి ని ఎందుకు వదిలిపెడుతున్నారు. బీఆర్ఎస్ కన్ స్ట్రక్షన్ చేసిందని, సీఎం రేవంత్ మాత్రం డిస్ట్రక్షన్ చేస్తున్నాడన్నారు.

### పర్మిషన్ ఇచ్చిందెవడు..?

బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్ లు, ఫ్లై ఓవర్లు, ఎస్టీపీలు కట్టిందని, ఈ ముఖ్యమంత్రి మా త్రం 9 నెలల్లో బెదిరింపులు, కూలగొట్టుడు, బ్లాక్ మెయిలు చేస్తున్నాడన్నారు. నాగార్జున కు సంబంధించిన నిర్మాణాన్ని కూల్చేశారు మంచిదే, కానీ పర్మిషన్ ఇచ్చిందెవడు అని కేటీఆర్ నిలదీశారు. ఎవ్వడు అనుమతులు ఇచ్చారో వారిపై చర్యలు తీసుకో దమ్ముంటే సీఎం చెప్పాలన్నారు. ఉన్నదున్నట్టుగా మా ట్లాడితే బీఆర్ఎస్ వాళ్లు ఆక్రమణలను ప్రో త్సహించామంటూ తప్పుడు ప్రచారం చేస్తు న్నారన్నారు. దమ్ముంటే సీఎం వెంటనే ప ట్నం మహేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్లు కూల్చాలని సవాల్ విసిరారు.

### పేదల కోసం పోట్లాడుతాం..

పేదవాళ్ల కు ఎవరు అండగా లేరని వారిపై దౌర్జన్యం చేస్తున్నారని, వారి తరపున కొట్లా డడానికి బీఆర్ఎస్ సర్వవేళలా సిద్ధంగా ఉందన్నారు. పేదవాళ్లే దిక్కులేక ఎక్కడైనా నాలాలపై ఇళ్లు కట్టుకుంటారని, మానవ త్వం ఉన్న ప్రభుత్వమైతే వాళ్లకు నోటీసులు ఇవ్వలే, లేదంటే వాళ్లకు వేరే ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ కట్టించిన 40 వేల డబుల్ బెడ్ రూమ్ లు పేదవాళ్లకు పంచాలన్నారు. పేదలకు అండగా ఉండేందుకు త్వరలోనే హైదరాబాద్ ఎమ్మెల్యేలతో మీటింగ్ పెడతా మన్నారు. కేసీఆర్ అనుమతితో వాళ్లకు అండగా ఉండే కార్యక్రమాలను చేపడతాం అని సెలవిచ్చారు.

# 15 నుంచి ఇందిరమ్మ ఇండ్లు..

- లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతాం
- వారం రోజుల్లో విధివిధానాలు..
- ఇండ్లులేని పేదలకు తీపి కబురు



**జనపదం, ఖమ్మం:** ఇందిరమ్మ ఇళ్లపై సర్కార్ కీలక ప్రకటన చేసింది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నాటి నుంచి ఎదురుచూ స్తున్న ప్రజలకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీపిక బురు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వారం రోజుల్లో విధివిధానా లను రూపొందిస్తామని చెప్పారు. అక్టోబరు 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేప ట్టనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయంలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులకు అందించే అంశంపై కేబినెట్‌లో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వ నున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 2 నుంచి అర్హులకు హెల్త్‌కార్డులు, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. మంత్రి ప్రకటనతో ఇండ్లులేని నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా ఇండ్లు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

### నియోజకవర్గానికి 3,500 ఇండ్లు..

కాగా, తెలంగాణలోని 119 నియోజకవర్గా లకు ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. అర్హులకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు మరో రూ.లక్ష అదనంగా కలిపి రూ.6 లక్షలు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇదివరకే ప్రకటించా రు. మొత్తంగా నాలుగు విడతల్లో రూ. 5 ల క్షల సాయం ఇవ్వనున్నారు. బేస్‌మెంట్ స్థా యిలో రూ.లక్ష, పైకప్పు నిర్మాణం జరిగే స మయంలో మరో రూ.లక్ష, పైకప్పు నిర్మా ణం పూర్తయిన తర్వాత మూడో విడతగా రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష అందించనున్నారు.

# కొత్త రూట్‌లో మెట్రో రైలు

- ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి..
- దసరాలోగా డీపీఆర్ రూపొందించండి..
- సీఎం రేవంత్ రెడ్డి



**జనపదం, సిటీబ్యూరో:** హైదరాబాద్‌లో మెట్రో రైలు మార్గాన్ని విస్తరించేందుకు కసరత్తును వేగవంతం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. మరో కొత్త మార్గంలో మెట్రో లైన్ వేయాలన్న ప్రతి పాదనను తీసుకొచ్చింది. ఇప్పటికే.. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు, మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు మెట్రో విస్తరణ పనులు వేగంగా జరుగుతుండగా.. ఇప్పుడు కొత్తగా ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి కూడా మెట్రో మార్గాన్ని విస్తరిం చాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ మేరకు.. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని సంబంధిత అధికారులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు.. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలు, మెట్రో రైలు విస్తరణ వంటి అంశాలపై ఉన్నతస్థాయి సమావేశంలో సమీ క్షించిన సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకు లుంటే అధికారులు వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరి ష్కరించాలని సూచించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్‌పై పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమ ర్పించాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. ఫ్యూచర్ సిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రతి వేదికపై దీని గురించి ప్రస్తావిస్తూనే ఉన్నారు. స్కిల్ యూనివ ర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాంటి కొత్త కొత్త ప్రాజెక్టులన్నీ ఫ్యూచర్ సిటీలోనే ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే.. సైబర్ సిటీకి ధీటుగా ఫ్యూచర్ సిటీని రూపుదిద్దనున్నట్లు ప్రతిసారీ చెప్తున్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అక్కడికి మెట్రో రైలును కూడా విస్తరించేలా చర్యలు తీసుకుంటుండటం గమనార్హం.

# మూడు రోజులు..కీలక ఒప్పందాలు..

- ముగిసిన మోడీ అమెరికా టూర్
- సాయుధ డ్రోన్ల కొనుగలుపై బైడెన్ తో చర్చలు ఓకే
- ఇండే-పసిఫిక్ శాంతి కోసం సమష్టి కృషికి నిర్ణయం



**జనపదం, న్యూఢిల్లీ:** అమెరికా పర్యటన తర్వాత ప్రధాని మోడీ ఢిల్లీకి తిరిగి వచ్చారు. ఆయన మూడు రోజుల అమెరికా పర్యటన విజయవంతంగా ముగి సింది. మోడీ యూఎస్ పర్యటనలో క్వాడ్ సమ్మిట్ లో పాల్గొనడం, యూఎన్ జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఫర్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ప్రసంగిం చడంతోపాటు అనేక మంది ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. అమెరికా పర్యటనలో చివరి రోజు బిజీబిజీగా గడిపారు. అమె రికా టెక్ కంపెనీలు భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. అమెరికా పర్యటనలో ప్ర ధాని మోడీ ఎజెండా అనేక ముఖ్యమైన కార్యక్రమా లతో నిండిపోయింది. ఆస్ట్రేలియన్ ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిడాతో జో బిడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్, డెలావేర్‌లో సమావేశమయ్యారు. అక్కడ నలుగురు నాయకులు క్వాడ్ సమ్మిట్‌కు హాజరయ్యారు. సమా వేశం సందర్భంగా, జనరల్ అటామిక్స్ తయారు చేస్తున్న 31 ఎంక్యూ -9 బి సాయుధ డ్రోన్‌ల కొనుగోలుపై బిడెన్, మోడీ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. అంతేకాకుండా, రక్షణ హార్డ్‌వేర్ సరఫ రాను పెంచడం గురించి కూడా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. కాగా, అమెరికాకు స్మగ్లింగ్ చేసిన 297 పురాతన వస్తువులను బిడెన్ ప్రధాని మోడీకి తిరిగి ఇచ్చారు.

### ద్వైపాక్షిక సమావేశాలు..

క్వాడ్ సమ్మిట్ సందర్భంగా ఆస్ట్రేలియా, జపాన్ నాయకులతో మోడీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వ హించారు. పరస్పర ప్రయోజనం కోసం సహకా రాన్ని మరింతగా పెంచుకోవాలని నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయ స్సును ప్రోత్సహించే లక్ష్యంతో చర్చలు జరిగాయి. క్వాడ్ సమ్మిట్‌లో, సహకారం, అనుసంధానం ద్వారా అభివృద్ధికి భారతదేశం నిబద్ధతను మోడీ నొ క్కిచెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్యాన్సర్‌తో పోరాడటానికి క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ చొరవను కూడా సమ్మిట్ ప్రకటించింది. గర్భాశయ క్యాన్సర్ తో పోరాడటానికి భారతదేశం 7.5 మిలియన్ డాలర్లను సాయం చేసుకోవాలని క్వాడ్ దేశాలు నిర్ణ యించాయి. ఆ తర్వాత మోడీ న్యూయార్క్‌లో భార తీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. భార తదేశం- అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో భారతీయ- అమెరికన్ కమ్యూనిటీ వారి పాత్రను ప్రధాని మోడీ ప్రశంసించారు. న్యూయా ర్క్‌లో, మోదీ పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అ బ్బాస్‌ను కూడా కలుసుకున్నారు. గాజాలో మానవ తా సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి కోసం భారతదేశం మద్దతును పునరుద్ఘాటించారు. అగ్రశ్రేణి యూఎస్ టెక్ కంపెనీల సీఈవో లతో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తయారీ, ఆవిష్కరణకు భారత్‌ను గమ్యస్థానంగా చూడాలని అమెరికన్ టెక్ కంపెనీలకు మోదీ విజ్ఞప్తి చేశారు. భారత్‌తో కలిసి అభివృద్ధి, డిజైన్, ఉత్పత్తి చేయాలని సూచించారు. అమెరికాలోని న్యూయా ర్క్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాని మోడీ ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ దిగ్గజా లతో సమావేశమయ్యారు. అసెంచర్, అడోబ్, గూ గుల్, ఐబీఎం సహా 15 ప్రఖ్యాత కంపెనీల సీఈవోలు, ఛైర్మన్లు పాల్గొన్నారు.

### సీఈవోలతో సమావేశం..

గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంతను నారాయణ్, ఎన్విడి యా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 కంపెనీల సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొ న్నారు. పలు టెక్ కంపెనీల సీఈవోలతో సక్సెస్‌ఫుల్‌గా చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నో వేషన్ తదితర అంశాల గురించి చర్చించామని మోడీ తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

# సింగరేణి కార్మికులకు 9న బోనస్

**జనపదం, ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మి కులకు ఇటీవల ప్రకటించిన 33 శాతం లాభాల వాటా బోనస్‌ను వచ్చే నెల 9న చెల్లించేందుకు యా జమా న్యం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఈ మేరకు మంగళ వారం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలతో సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. సింగ రేణి సంస్థ 2023- 24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాలలో 33 శాతం అంటే రూ.796 కోట్లు లాభాల వాటా బోనస్‌గా చెల్లిస్తామని ఇటీవల ఇటీవ ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీ ఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటిం చారు. కార్మికు లకు సింగరేణి చరిత్ర లో ఇది అత్యధికం కావడం విశేషం. సంస్థలో పనిచేస్తున్న సుమారు 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తాము పనిచేసిన పని దినాల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని లాభాల వాటా బోనస్ చెల్లిస్తారు. సగటున ఒక్కొక్కరు సుమారు రూ.1.90 లక్షల చొప్పున బోనస్ పొందే అవకాశం ఉంది.ఇక ఈసారి సింగరేణి లో పని చేస్తున్న దాదా పు 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు లాభాల వాటా బోనస్ చెల్లించాలని నిర్ణయించింది.

### పండుగ అడ్వాన్సు

లాభాల వాటా బోనస్ తో పాటు సింగరేణి సంస్థ ఎప్పటి లాగానే ఈ ఏడాది కూడా దసరా పండుగ అడ్వాన్స్ ను సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని సీఎండీ బలరామ్ ఆదేశించారు. ఒక్కొక్కరికి రూ.25 వేల పండుగ అడ్వాన్స్ చెల్లించనున్నారు. దీని కోసం సంస్థ రూ.95 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్ నెల జీతాలతోపాటే ఈ పండుగ అడ్వాన్స్ సొమ్మును కూడా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. లాభాల వాటా బోనస్, దసరా పండుగ అడ్వాన్సులు కలిపి దాదాపు రూ.900 కోట్లు సింగరేణి ఉద్యోగులకు చెల్లించ నున్న నేపథ్యం లో సింగరేణి సిబ్బంది వ్యవహా రాలు, ఆర్థిక విభాగాలు తగు ఏర్పాట్లు చేయాలని సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.



# దాడులతో మనో ధైర్యాన్ని దెబ్బతీయలేరు ..

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శ
- సంఘటనపై బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరా


**జనపదం, బ్యూరో :** దాడులతో సునీతా లక్ష్మారెడ్డి లాంటి ఎమ్మెల్యేలను, బీఆర్ ఎస్ మాజీ ప్రజాప్రతినిధుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యేకు ఫోన్ చేసి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంఘటన తాలూకు వివరాలను సునీత లక్ష్మారెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి విధ్వంసం చేసే ప్రయత్నం చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో సునీత లక్ష్మారెడ్డి లాంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలేమనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించాలన్నారు. ఎన్ని అరాచకాలకు పాల్పడిన 60 లక్షల మంది బీఆర్ ఎస్ కుటుంబం ప్రజాప్రతినిధి నుంచి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# 'అమృత్' పై అనవసర రాద్ధాంతం..

- టెండర్లలో సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం లేదు
- కేటీఆర్ ను తప్పుదోవ పట్టించారు.
- త్వరలో ఆయన్ను కలిసి అన్నీ వివరంగా చెప్తా..
- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ :** కేంద్ర ప్రభుత్వ 'అమృత్' పథకం టెండర్ల పవిషయంలో అనవసరంగా వివాదం చేస్తున్నారని, దీనికి సీఎం రేవంత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని పాలేరు బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. టెండర్ల విషయమై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎవరో తప్పుదోవ పట్టించారని త్వరలో ఆయన్ను కలిసి వాస్తవాలు చెబుతానని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకు, వ్యాపారానికి సంబంధం లేదని, పదేళ్ల బీఆర్ఎస్ పార్టీ హయాంలో లబ్ధి పొందిన వారే ఇప్పుడు కూడా ముందు వరుసలో ఉన్నారని తీవ్రంగా ఆరోపించారు. నా అల్లుడు సృజన్ రెడ్డి రేవంత్ రెడ్డికి సొంత బావమరిది కాదని, రేవంత్ రెడ్డి చిన్న మామ కుమారుడు సృజన్ రెడ్డి అని ఆయన తెలిపారు. సృజన్ రెడ్డికి రాజకీయాలతో సంబంధం లేదని, వ్యాపారంలో జాయింట్ వెంచర్లు సహజమని, అమృత్ టెండర్లలోనూ అదే జరిగిందని పేర్కొన్నారు. అమృత్ టెండర్ల వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం లేదని అన్నారు. కేటీఆర్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించానని, ఆయనను కలిసి వాస్తవాలు చెబుతానని ఉపేందర్ రెడ్డి చెప్పారు. అర్హత లేదు కాబట్టే జాయింట్ వెంచర్ కు వెళ్లారని, రాజకీయం చేయడం తగదని సూచించారు. నేను రాజకీయాల్లో ఇంకా చురుకుగ్గానే ఉన్నానని, నిన్న కూడా నియోజకవర్గంలో పర్యటించానని తెలిపారు. ఆన్లైన్ టెండర్ల ద్వారా రూల్స్ ప్రకారమే మా కుమారుడు టెండర్ దక్కించుకున్నారని, అవసరమైతే మీడియా ముందుకు సుజన్ రెడ్డి రావడానికి సిద్ధంగా ఉన్నాడని కందాల ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు.



# నిబంధనల సవరణపై ఏం చేస్తారు

## ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

**జనపదం, బ్యూరో :** తెలంగాణలో గ్రూప్-1 నియామకాల నిబంధనలు సంవరించడంపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. గత నిబంధనల ప్రయోజనాలతో పోలిస్తే కొత్త నిబంధనలు అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో స్పష్టం చేయాలని సూచించింది. నిబంధనల సవరణల వల్ల గతానికి, ప్రస్తుతానికి ఉన్న తేడాను వివరించాలని ఆదేశిస్తూ రాంబాబు వేసిన కేసు పిటిషన్ విచారణను సెప్టెంబరు 25కు వాయిదా వేసింది.

**1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు..**

నల్గొండ జిల్లాకు చెందిన రాంబాబు 2018, 2019లో దివ్యాంగుల రిజర్వేషన్లపై నిబంధనలను సవరిస్తూ జారీ చేసిన 10, 96, 29 జీవోలను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. అయితే రాంబాబు పిటిషన్ పై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావులతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. గత నిబంధనల ప్రకారం సమాంతర రిజర్వేషన్లు అమలుచేయాలని, 1:50 నిష్పత్తిలో ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు పిలవాలని రాంబాబు తరఫు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. దీంతో సర్వీసు వ్యవహారాలపై సింగిల్ జడ్జి విచారించాల్సి ఉండగా హైకోర్టు వరకూ ఎలా వచ్చిందని ప్రశ్నించింది. చివరగా విచారణను సెప్టెంబరు 25కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# మాట నిలుపుకోండి..

- ఆర్‌ఆర్‌ఆర్ పై హామీని నెరవేర్చండి..
- మాట మార్చుడు.. మభ్య పెట్టుడే కాంగ్రెస్ విధానమా..?
- కోమటి రెడ్డికి మతి మరుపు ఎక్కువైంది..
- నాడు ధర్నా.. నేడు దౌర్జన్యమా..?
- మాజీ మంత్రి హరీష్ రావు
- త్రిపుల్ ఆర్ బాధితుల పక్షాన పోరాడుతామని హామీ..
- తమకు బాసటగా ఉండాలని వేడుకున్న బాధితులు.



**జనపదం, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాకుంటే ఆర్‌ఆర్‌ఆర్ బాధిత రైతుల తరపున పోరాటం చేస్తామని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆర్‌ఆర్‌ఆర్ బాధిత రైతులు హరీష్ రావును కలిశారు. ఆర్ ఆర్ ఆర్ రైతుల విషయంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని మంత్రికి వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ కూడా తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం దిగిరాకుంటే బాధితుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఉత్తర దిక్కు ఆర్ ఆర్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ అధినేత ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నారు. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దౌర్భాగ్యనారు. ఆర్ ఆర్ ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణలోకి తీసుకొని జంక్షన్ ఏర్పాటు చేయడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్య నుండి రోడ్డు వెళ్లడం వలన మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నదనీ, బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నారన్నారు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికి గాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారని వాపోయారు. దక్షిణ భాగాన ఆర్ ఆర్ ఆర్ కోసం ఎలాగైతే 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకుంటున్నారో, ఉత్తర బాగానే ఉన్న చౌటుప్పల్ వైపు 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాన్నారు. ఎంపీగా ఉన్నపుడు కోమటి రెడ్డి బాధితులతో కలిసి ఆర్ ఆర్ ఆర్ మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారని, పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంతం పెట్టడం దుర్మార్గమైన చర్య అని మండి పడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి హామీలను అమలు చేయాలని, లేదంటే బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

# నిర్లక్ష్యమే..నిండా ముంచింది..

- గత పాలకుల వైఫల్యమే గండ్లకు కారణం
- రైతాంగానికి సర్కారు బాసట
- తమది రైతు పక్షపాత ప్రభుత్వం
- బుధవారం నీటి విడుదల
- గండి పూడ్చే పనులు పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జనపదం, కోదాడ :** పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రస్తుత సాగర్ కాలువ కట్ట గండ్ల కు కారణమని, లోపభూయిష్టమైన నిర్వహణ ఫలితమే ఇంతటి నష్టం సంభవించిందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం కోదాడ నియోజకవర్గ నడిగూడెం మండల పరిధిలోని కాగిత రామచంద్రాపురం 132 కి.మీ వద్ద సాగర్ ఎడమ కాలువ కట్ట కు పడిన గండి మరమ్మత్తు పనులను ఆయన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లష్కర్ లతో పాటు ఇంజనీర్లను, సిబ్బంది నియామకాలు చేపట్టకుండా నీటిపారుదల శాఖ ను నిర్వీర్యం చేసి నేడు వరదలపై బురద రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. తమ పదేళ్ల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విపక్షం విమర్శలు చేస్తుందని దుయ్యబట్టారు. గండి పడిన ప్రాంతం వరకు సాగునీరు అందించాలని, తుదిదశ పనులను పూర్తి చేయడంలో ఎందుకు ఆలస్యమవుతుందని అధికారులను ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొందరు రైతులు నీటి సరఫరా లేక తమ పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన చేపట్టారు. రైతులు అధైర్యపడవద్దని, పంటలకు నష్టం జరగకుండా పంటలను కాపాడుకునేందుకే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి నీటి విడుదలకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. బుధవారం ఉదయం నీటి విడుదల చేస్తామని పేర్కొన్నారు.

**రైతాంగానికి సర్కారు బాసట**

పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి తో పాటు మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగమంతా విపత్తు సంభవించిన గంటల్లోనే క్షేత్రస్థాయిలో సందర్శించి క్షణాల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టామన్నారు. రెండు రోజుల్లో నీటిపారుదల శాఖ కు చెందిన 700 మంది ఏఈఈ లకు ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందజేస్తారని, త్వరలో 1800 మంది లష్కర్లను నియమిస్తామని వివరించారు. అనంతరం 133.5 కి మీ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఫోన్ లో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో నీటి విడుదల అంశంపై మాట్లాడారు. అక్కడ నుంచి 128.24 కిలో మీటర్ వద్ద నిర్మించిన క్రాస్ బండ్ వద్దకు చేరుకుని సైఫాన్ ద్వారా దిగువకు ప్రవహిస్తున్న నీటి తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎన్నెస్పీ సీఈ రమేష్ బాబు, ఎస్ఈ శివ ధర్మతేజ, ఈఈ రాంకిషోర్, డీఈ రఘు, ఏఈ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# మత శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆదివాసీ చట్టాలను గౌరవించాలి
- దుష్టశక్తులు పెట్రేగే అవకాశాలకు తావివ్వొద్దు
- యువతను సన్మార్గంలో నడిపిలా అవగాహన కల్పించండి
- మంత్రి సీతక్క, షబ్బీర్ అలీ, వెడ్మా బొజ్జు
- ఆదిలాబాద్ ఏజేన్సీ ప్రాంత ముస్లింలతో ప్రభుత్వం చర్చలు
- శాంతి నెలకొల్పేందుకు త్వరలో ఉమ్మడి సమావేశం



**జనపదం, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ లో జరిగిన జైనూరు ఘటన నేపథ్యంలో స్థానిక ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య సయోధ్య కుదుర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం వరుస బేటీలు నిర్వహిస్తుంది. రెండు రోజుల క్రితం ఉట్నూర్ లో ఆదివాసీ సంఘాలతో ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ చర్చలు జరపగా., తాజాగా మైనారిటీ వర్గానికి చెందిన పెద్దలతో మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి సమావేశం అయ్యారు. సమస్య మూలాలతో పాటు పరిష్కార మార్గాలను సూచించాలని కోరగా మైనారిటి పెద్దలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు. వ్యక్తిగత విభేదాలకు మతం రంగు పూస్తూ మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొన్ని రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని, ఆ శక్తులను కట్టడి చేసేలా బందోబస్తు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఎంతో కాలంగా సఖ్యతతో నివసించిన రెండు వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే మూకలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మూడు గంటలకు పైగా సాగిన సమావేశంలో మైనారిటి పెద్దలు వ్యక్త పరిచిన అభిప్రాయాలను సావదానంగా విన్నారు. అనంతరం ప్రభుత్వం తరుపున మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ..మత రాజకీయాల పట్ల తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు.

**విబేధాలు విచారకరం..**

నిజాం హయాం నుంచి ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సఖ్యతగా మెలిగిన ఆదివాసి, మైనారిటి వర్గాల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల మంత్రి సీతక్క విచారం వ్యక్తం చేశారు. సమస్య మూలాలను గుర్తించి పరిష్కరిస్తామని చెప్పారు. ఆదివాసీలకు ప్రత్యేక చట్టాలున్నందున వాటిని మైనారిటీలు గౌరవించాలని కోరారు. కొంత మంది యువకులు చేస్తున్న చేష్టలను చూపి.. మైనారిటీల పట్ల వ్యతిరేక భావనను కలిగించేందుకు కొన్ని దుష్ట శక్తులు ప్రయత్నిస్తాయని.. అందుకే మైనారిటీ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఆదివాసీ చట్టాలను, మహిళలను గౌరవించేలా ప్రార్ధన మందిరాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

**ఉపాధి లేక ఇబ్బందులు**

ఏజెన్సీ, వెనకబడిన ప్రాంతాల్లో పదేండ్లుగా ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. నిరుద్యోగ సమస్య ఆసరగా యువతను తమ స్వార్ధ రాజకీయాలను కొన్ని శక్తులు వాడుకుంటున్నాయని..వాటి పట్ల తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఏదన్నా సమస్య తలెత్తితే శాంతియుతంగా నిరసన తెలపాలి తప్పితే...చట్టాన్ని తమ చేతుల్లోకి ఎవరు తీసుకున్నా ఉపేక్షించదని హెచ్చరించారు. వర్గాలు, కులాల మధ్య గొడవలు జరిగితే అభివృద్ధి కుంటుపడు తుందని చెప్పారు. అందుకే అన్ని వర్గాల ప్రజలు సఖ్యతతో మెలగాలని చెప్పారు.రెండు వర్గాల మధ్య నెలకొన్నఅపనమ్మకాన్ని పొగెట్టేలా త్వరలో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. త్వరలో సీఎంతో ఇరు పక్షాలను సమావేశ పరుస్తామన్నారు.ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆదివాసి ఏరియా అభివృద్ధిలో, శాంతిని నెలకొల్పడంలో మైనారిటి సోదరులు సహకరించాలని కోరారు.



# ఎగ్గొడితే ఊరుకోం..

- రుణమాఫీ, బోనస్.. అంతా బోగస్
- రేవంత్ వి అన్నీ పచ్చి అబద్ధాలు
- హామీలు నెరవేర్చే వరకూ ప్రభుత్వం మెడలు వంచుతాం
- 30న బీజేపీ రైతు హామీల సాధన దీక్ష
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**స్పాట్ వాయిస్, బ్యూరో :** రైతు భరోసా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తే ఊరుకునేదని, రైతు రుణమాఫీ, వడ్లకు బోనస్ అంతా బోగస్ అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని, రైతు హామీల సాధన కోసం ఈనెల 30 వతేదీ ఉదయం 11 గంటల నుంచి అక్టోబర్ 1న ఉదయం 11 గంటల వరకు హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా మొత్తం బోగస్ అని,అన్నదాతల సంక్షేమం విషయంలో సీఎం రేవంత్ రెడ్డివన్నీ పచ్చి అబద్ధాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని స్పష్టం చేశారు. క్యాబినెట్ మీటింగ్ కేవలం చాయ్, బిస్కెట్ ల కోసమేనన్నారు. గుత్తేదారుల కోసం, వాళ్లకు కాంట్రాక్టులు ఇవ్వడానికి చర్చించారే తప్ప ఇంకేం కోసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, బూటకపు ఆరు గ్యారంటీలను ఇచ్చి వాటిని ఎందుకు నెరవేర్చట్లేదని ప్రశ్నించారు. దేవుళ్లందరి మీద ఒట్టు పెట్టి సగం మందికి మాత్రమే రైతురుణమాఫీ చేశారన్నారు. ఇందు రూ.,30 వేల కోట్లు అవసరమని కేబినెట్లో చెప్పి కేవలం రూ.17 వేల కోట్ల ఖర్చు పెట్టారన్నారు. రైతు రుణ మాఫీకి ఇంకా రూ.13వేల కోట్లు అవసరమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెబితే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మొత్తం అయ్యింది అంటున్నాడని, మంత్రులు పూర్తి స్థాయిలో కాలేదని ఇలా తలో మాట చెబుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నానన్నారు. రైతు భరోసా రూ.15వే ఇస్తానని, నేటికీ అతీగతి లేదన్నారు. అయితే రైతు భరోసా ఎగ్గొట్టాలని చూస్తే మాత్రం బీజేపీ మీ మెడలు వంచి రైతులకు న్యాయం చేస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ రైతు భరోసా పేరుతో ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇస్తానని, వడ్లకు బోనస్ ఇస్తామని మోసం చేశారు..ఇప్పుడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, సన్న, దొడ్డు వడ్ల విషయంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్ని అభద్దాలు అడుతున్నాడన్నారు. సర్కారుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతులకు న్యాయం చేయాలన్నారు. 30న బీజేపీ రైతు హామీల సాధన దీక్షలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఏలేటి మహే శ్వర్ రెడ్డి కోరారు.



# మంజీరా నది ఉధృతి..

## ఏడుపాయల వనదుర్గ ఆలయం మూసివేత

**జనపదం, మెదక్ :** ఏడుపాయల వనదుర్గ ఆలయం మరోసారి మూతపడింది. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో భారీగా వరద పోటెత్తింది. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. వరద ప్రవా హం మరింత పెరిగే అవకాశం ఉండటంతో అమ్మవారి దర్శనాలను నిలిపివేశారు. దీంతో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాలతో ఈ నెలలో ఏడుపాయల ఆలయం మూతపడటం ఇది మూడో సారి. ఈ నెలారంభంలో మెదక్ జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచికొట్టాయి. దీంతో సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. గేట్లు ఎత్తివేయడంతో ఆలయం నీటమునిగింది. దీంతో 8 రోజులపాటు అధి కారులు ఆలయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే.



# నాలుగు రోజులు వర్షాలు

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

**జనపదం, బ్యూరో:** తెలంగాణలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తరాం ధ్ర, దక్షిణ ఒడిశా తీరాలను ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడ నం ఏర్పడిందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి వై పునకు వంగి ఉందని చెప్పింది. బుధ వారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబా ద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే, పలుచోట్ల ఉరుము లు, మెరుపులతో పా టు భారీగా ఈదురుగాలులతో వర్షాలు పడే సూచనలున్నాయని హెచ్చరిం చిం ది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

**హైదరాబాద్ లో దంచికొట్టిన వాన..**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం భారీగా కురిసింది. సుచిత్ర, గుండ్లపోచంపల్లి, బహదూర్‌పల్లి, సూరారం, కొంపల్లి, చింతల్, కండ్లకోయ, కృష్ణా పూర్, దుండిగల్, గాగిల్లాపూర్, గౌడవ ల్లి, మునీరాబాద్, డబిల్‌పూర్‌లలో ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షానికి ఈదురుగాలులు కూడా తోడ య్యాయి. ఫలితంగా పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. ముందే సమాచారం ఉ న్న జీహెచ్ఎంసీ సిబ్బంది, డీఆర్ఎఫ్ సిబ్బంది రహదారులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే పనిలో ఉన్నారు. పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితులను చక్కదిద్దారు.



# సీఎంను విచారించండి..

**కర్ణాటక హైకోర్టు.. సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ**

**జనపదం, బెంగళూరు:** ముడా స్కామ్ కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు చుక్కెదురైంది. ఆ కేసులో విచారణను నిలిపి వేయాలని ఆయన వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. కేసులో సీఎంను కూడా విచారించాలని గవర్నర్ గెహ్లాట్ ఇచ్చిన ఆదేశాలను సిద్ధరామయ్య కోర్టులో సవాల్ చేశారు. దీనిపై విచారణ నేపథ్యంలో కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు హైకోర్టులో చుక్కెదురైంది. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పును ఇచ్చింది. గవర్నర్ గెహ్లాట్ వ్యక్తిగత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఆయన పూర్తిగా మెదడు పెట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ నాగప్రసన్న తెలిపారు. అందుకే సీఎంను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని హైకోర్టు తెలిపింది.

# జాబ్ గ్యారంటీ..



## 38 కాలేజీల్లో కొత్త కోర్సులు..

**జాబితా విడుదల చేసిన ప్రభుత్వం**
**డిగ్రీతో పాటు సరికొత్తగా నైపుణ్య డిగ్రీ**
**దేశంలోనే వినూత్న ప్రయోగానికి శ్రీకారం**

**జనపదం, ఎడ్యుకేషన్ బ్యూరో:** రాష్ట్రంలో ఈ ఏడాది డిగ్రీ, ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సురెన్స్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. రెగ్యులర్ డిగ్రీతో పాటు మినీ డిగ్రీ కోర్సుగా బీఎఫ్ఎస్ఐ నైపుణ్య శిక్షణను అందించే వినూత్న కార్యక్రమాన్ని ఈ నెల 25న ప్రారంభిస్తోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తారు. ఉన్నత విద్యామండలి గుర్తించిన 18 ఇంజనీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న 10 వేల మంది విద్యార్థులకు ఈ శిక్షణ అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మేలు జరిగేలా ఈ కాలేజీలను ఎంపిక చేసింది. అత్యంత ఖరీదైన ఈ కోర్సును డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉచితంగా అందించనుండటం విశేషం. ఈ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణను అందుకుంటున్న 10 వేల మంది విద్యార్థుల వివరాలతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రత్యేక ఆన్ లైన్ పోర్టల్ రూపొందిస్తోంది. విద్యార్థుల బయోడేటాతో పాటు చదువుతున్న కాలేజీ, వారి విద్యార్హతలు, సాంకేతిక కోర్సుల అనుభవం వివరాలన్నీ అక్కడ పొందుపరుస్తారు.

బీఎఫ్ఎస్ఐ రంగంలో పేరొందిన కంపెనీలు తమకు అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు ఈ పోర్టల్ వారధిగా పని చేస్తుంది. బీఎఫ్ఎస్ఐ కంపెనీలు ఈ పోర్టల్లో ఉన్న విద్యార్థులతో నేరుగా వీడియో కాల్ ద్వారా ఇంటర్వ్యూ చేసే వీలుంటుంది. దీంతో డిగ్రీ, ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు చదువుతో పాటు ఉద్యోగ భరోసాకు ప్రభుత్వం కొత్త బాటలు వేసింది.

**కోర్సుకు ఎంపిక చేసిన కాలేజీలు (నాన్ ఇంజినీరింగ్ 20 కాలేజీలు)**


పింగళి ప్రభుత్వ మహిళా కాలేజీ, వడ్డేపల్లి(హన్మకొండ), ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ(ఖమ్మం), నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(నల్గొండ), ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, భవన్ డిగ్రీ, పీజీ కాలేజీ, ప్రభుత్వ సిటీ కాలేజీ(హైదరాబాద్), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(సిద్దిపేట), ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ(బేగంపేట), ప్రభుత్వ డిగ్రీ కాలేజీ( ఖైరతాబాద్), ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీ(నాంపల్లి), నిజాం కాలేజీ, ఆర్.బి.వి.ఆర్.ఆర్ డిగ్రీ కాలేజీ(హైదరాబాద్), సెయింట్ అన్స్ మహిళా డిగ్రీ కాలేజీ(మెహిదీపట్నం), సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా డిగ్రీ కాలేజీ, (హైదరాబాద్), సెయింట్ పియస్ ఎక్స్ మహిళా డిగ్రీ కాలేజీ(నాచారం), తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(సంగారెడ్డి), ఎం.వి.ఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ(మహబూబ్‌నగర్), ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ(కరీంనగర్), తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం(కోఠి), గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ(నిజామాబాద్).

**ఇంజనీరింగ్ కాలేజీలు (18):**

బివిఆర్ఐటి హైదరాబాద్ ఇంజనీరింగ్ కాలేజీ (జెఎన్‌టియు హెచ్), జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జెఎన్‌టియు హెచ్), గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ & టెక్నాలజీ కాలేజీ (జెఎన్‌టియు హెచ్), జె.బి ఇంజనీరింగ్ & టెక్నాలజీ కాలేజీ (జెఎన్‌టియు హెచ్), జెఎన్‌టియు కూకట్‌పల్లి ప్రధాన క్యాంపస్ (జెఎన్‌టియు హెచ్), కేశవ్ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జెఎన్‌టియు హెచ్), మహాత్మా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జెఎన్‌టియు హెచ్), వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ (జెఎన్‌టియు హెచ్), వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ (జెఎన్‌టియు హెచ్), కిట్స్ వరంగల్ (కేయూ), చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఓయూ), మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ), మాటూరి వెంకట సుబ్బారావు ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ), మెథడిస్ట్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ కాలేజీ (ఓయూ), ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ), స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ & టెక్నాలజీ కాలేజీ (ఓయూ), ఆర్జీయుకేటీ బాసర (ఆర్జీయుకేటీ), బివి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నర్సాపూర్ (జెఎన్‌టియు హెచ్).

# కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**జనపదం, ఖమ్మం :** ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ ఖైకొండాయగూడెంలో టియుఎఫ్ఐడిసి నిధులు రూ.195 లక్షలతో, 59వ డివిజన్ దానవాయిగూడెం లో రూ.200 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పని చేస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ లో రెండు కోట్ల నిధులతో 12 సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. శంకుస్థాపన చేసుకున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో 2 నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని అధికారులను ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వం తీసుకొని అర్హులైన పేదలకు పంచుతామన్నారు. దేవాదాయ, రెవెన్యూ భూములకు సంబంధించి ఎవరు పోజిషన్ లో ఉన్నా యుద్ధప్రాతిపదికన రిటర్న్ తీసుకోవాలని మంత్రి రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశించారు. అనంతరం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జలగం నగర్, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ, కరుణగిరి ప్రాంతాలలో మంత్రి మోటార్ సైకిల్ పై వీధి వీధి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటామని, వరదల వల్ల నష్టపోయిన ప్రతిఒక్కరికి పరిహారం అందజేస్తామని, ఆస్తి, పశు నష్టం జరిగిన వాటికి పరిహారాన్ని అందజేస్తామన్నారు.. ముంపు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అధికారులు మరోమారు సందర్శించి, నష్టపోయిన ప్రతిఒక్కరికి న్యాయం చేస్తారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ బాబు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# తెరపైకి ట్యాపింగ్..

**(మొదటిపేజీ తరువాయి)** వహించిన డీఎస్పీ పై వేటు వేశామని డీజీపీ పేర్కొన్నారు.

**డీజేలకు సంబంధించి త్వరలో గైడ్ లైన్స్**

ఊరేగింపులు, శోభయాత్రలకు డీజేలు పెట్టడం వలన శబ్ద కాలుష్యం పెరిగి హైదరాబాద్ నగర వాసులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వాటికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేస్తామని డీజీపీ జితేందర్ చెప్పారు. హైదరాబాద్, సైబరబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో గణేష్ నిమజ్జనం, మీలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా పోలీస్ శాఖ చాలాబాగా కృషి చేసిందని పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. బందోబస్తులో 15,400 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారని అన్నారు. అలాగే 12 వేల మంది ట్రైనీ ఎస్ఐ, కానిస్టేబుళ్ళను సైతం బందోబస్తు విధుల్లో వినియోగించామని చెప్పారు. 5,879 నిజ్జనం పాయింట్లు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూంలు, డీజీపీ కార్యాలయం నుంచి మానిటర్ చేశామన్నారు.

# తిరుమల లడ్డూ వివాదం

- యాదాద్రి ఆలయ అధికారుల కీలక నిర్ణయం
- ఏఆర్ డెయిరీకి నోటీసులు

**జనపదం, యాదాద్రి:** కల్తీ నెయ్యి వ్యవహారం దుమారం రేపటంతో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదాద్రి ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ప్రసాదంగా ఇచ్చే లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిని టెస్టుల కోసం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం యాదాద్రి ఆలయానికి మదర్ డెయిరీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. మదర్ డెయిరీ సరఫరా చేసే నెయ్యితోనే ఆలయంలో లడ్డూతో పాటు ఇతర ప్రసాదాలు తయారు చేస్తున్నారు. ఇక ఆలయంలో లడ్డూ తర్వాత అధికంగా పులిహోరను భక్తులు ప్రసాదంగా స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో పులిహోరపైనా అధికారులు ఫోకస్ పెట్టారు. పులిహోర నాణ్యతను పరీక్షిస్తున్నారు. నెయ్యి పరీక్షల అనంతరం ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా అధికారులు లడ్డూ తయారీపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.



# ములుగు మున్సిపాలిటీ బిల్లుకు ఆమోద ముద్ర వేయండి

- గవర్నర్ కు మంత్రి సీతక్క వినతి

**జనపదం, హైదరాబాద్ :** ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని గవర్నర్‌కు సీతక్క వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మంత్రి సీతక్క మంగళవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని కోరారు. సాంకేతికపరమైన చిక్కులతో ములుగు మున్సిపాలిటీ బిల్లు ఇంతకాలం పెండింగ్లోనే ఉందన్నారు. న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాల నేపథ్యంలో బిల్లును గత గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు పెండింగ్‌లోనే ఉందన్నారు. ఈ క్రమంలో బిల్లు వివరాలు గవర్నర్‌కు అందజేసిన మంత్రి సీతక్క ములుగుకు మున్సిపాలిటీ హోదా కల్పించే బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.



# ప్రజారోగ్యంపై పట్టింపు లేదా...?

- కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపాటు

**జనపదం, హైదరాబాద్ సిటీ :** రాష్ట్రంలో ప్రస్తుతం విని పిస్తున్న పేరు వైరల్ ఫీవర్ అని, ఎవరి నోట విన్నా, ఎవరి ఇంట్లో చూసినా ఇదే పరిస్థితి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్ద వాళ్ల వరకూ జ్వరంతో బాధపడుతున్నారని, తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పితోపాటు జలుబు వంటి లక్షణాలతో ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్ వ్యాప్తంగా దాదాపు అన్ని ఆసుపత్రులూ జ్వరాల బారిన పడిన రోగులతో కిక్కిరిసిపోతున్నాయన్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా ప్రజారోగ్యం విషయంలో యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా స్పందించారు. ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదని రేవంత్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎవడి చావు వాడు చస్తాడు మాకేం సంబంధం అన్నట్లుగా ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి పట్టింపు లేదు. ఎవడి చావు వాడు చస్తాడు మాకేం సంబంధం అన్నట్టుగా ఈ కాంగ్రెస్ సర్కార్ ప్రవర్తిస్తున్నది. రోగాలు, నొప్పులు, వ్యాధుల బాధలతో జనం అల్లాడుతున్నా చలనం లేదు... చర్యలూ లేవు. విష జ్వరాలు విజృంభించి ప్రజల ఒళ్ళూ ఇళ్లూ గుల్ల వుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. బస్తీలకు సుస్తీ చేసింది.. పల్లెలు మంచం పట్టినయ్.. అయినా వైద్యారోగ్య శాఖకు చీమకుట్టినట్టు కూడా లేదు.



పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి దోమలు స్వైర విహారం చేస్తున్నా ప్రభుత్వ శాఖలు మొద్దు నిద్ర వీడటం లేదు. ప్రాణాంతక రోగాలు పట్టి పీడిస్తుంటే.. అరికట్టాల్సిన ప్రభుత్వం అడ్రస్ లేదు..!' అంటూ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



ప్రముఖ కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు ఇంటి స్థలం ధ్రువపత్రాలను అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు. మొగులయ్యకు హయత్ నగర్ లో 600 చ.గజాల స్థలాన్ని కేటాయించిన ప్రభుత్వం. ఇందుకు సంబంధించి స్థల ధ్రువీకరణ పత్రాలను మొగిలయ్యకు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ. స్థల ధ్రువీకరణ పత్రం అందజేయడంపై సంతోషం వ్యక్తం చేసిన మొగిలయ్య.

# అంతా బీసీ జపం..

**(మొదటిపేజీ తరువాయి)** వారికి దక్కాల్సిన పదవులను అధ్యయనం చేయడానికి స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. సిరికొండ ఆధ్వర్యంలో కమిటీ తమిళనాడుకు వెళ్లి అక్కడి పరిస్థితులపై స్టడీ చేయాలని కూడా అధినేత ఆదేశించారు. దీంతో కారు పార్టీ కూడా బీసీల రాజకీయ చైతన్యానికి కట్టుబడి ఉన్నామనే సంకేతాలు ఇచ్చి సేఫ్ సైడ్ నిలిచింది.




**తప్పదన్నట్టుగా చేబట్టిన కాంగ్రెస్..**

అసెంబ్లీ ఎన్నికల వేళ బీసీల ఓట్లు కొల్లగొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కూడా హామీలు గుప్పించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత హామీల్లో భాగంగానే బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల విషయమై ముందుకెళ్లనున్నట్టుగా ప్రకటించింది. కానీ ఒక్క అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా గణన జరిగేది లేదు, రిజర్వేషన్ల ముచ్చట కొలిక్కి వచ్చేది లేదన్నట్టుగా రోజులు నెట్టుకొస్తున్నది. రాష్ట్రంలో ఏదో ఓ సమస్యను తెరపైకి తీసుకొస్తూ సీఎం అండ్ టీం ఎంతో హడావుడిగా ఉన్నట్టుగా నటిస్తున్న విషయం అర్థం చేసుకున్న బీసీ నేతలు ఈ మధ్య పలు సందర్భాల్లో బహిరంగంగానే సీఎంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. దీంతో ఇక ప్రజల్లో వ్యతిరేక బలపడకముందే ఏదైనా చేయాలనే ఆలోచనతో సీఎం కులగణనకు ఏర్పాట్లు చేయాలని అక్కడకక్కడ ప్రకటనల రూపంలో విడుదల చేస్తున్నారు. దేశమంతా బీసీలకు న్యాయం తమతోటే అని వల్లవేస్తున్న రాహుల్ నీతిని రాష్ట్రంలో కూడా ఇంప్లిమెంట్ చేయాలనే ప్రజల ఒత్తిడి మేరకు కాంగ్రెస్ కూడా బీసీ జపం చేయకతప్పని సరైంది.

**రాజకీయాల్లో కొత్త పీఠిక..**

తెలంగాణ రాజకీయాల్లో పార్టీలకు అతీతంగా బీసీ నేతలంతా ఒక్కటవుతున్న చాయలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాజధాని కేంద్రంగా మీటింగ్ లు, భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలతో అంతా కలిసి తిరుగుతున్నారు. అగ్రవర్ణాల పెత్తనానికి ఇక చరమగీతం పాడాల్సిన తరుణంపై యువత, బీసీ జనాభాలో అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే ఐదు నుంచి పదేళ్ల సమయంలో బీసీ నేత పగ్గాలు చేపట్టాల్సిన ఆవశ్యతకను తెలియజేస్తున్నారు. పార్టీలు కూడా తక్కువ జనాభా ఉన్నా అగ్రవర్ణాలతో నిండిపోయినా, ఇప్పుడున్న పరిస్థితుల్లో తప్పని సరై బీసీ పదాన్ని తలకెత్తుకుని సాగుతున్నాయి. రాజకీయాల్లో మరో కొత్త శకానికి ముందడుగా ఇప్పుడు అంతా బీసీలతోనే సాగుతున్నట్టుగా కలరింగ్ ఇస్తున్నారు.

# కేటీఆర్.. బలుపు మాటలు తగ్గించుకో..

- నువ్వు చేస్తే సంసారమా..?
- అప్పుడు మీరే చేసిందేంటి..? కండువా కప్పిన సన్నాసి ఎవడు..?
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**జనపదం, హైదరాబాద్ సిటీ:** కేటీఆర్ బలుపు మాటలు తగ్గించుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. పదేళ్లలో పార్టీ ఫిరాయింపుల కేరాఫ్ అడ్రస్ గా ఉన్న నువ్వు నీతులు చెప్తావా అని మండిపడ్డారు. 60 కి పైగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ,ఎంపీలను చేర్చుకున్న నువ్వు కూడా ఫిరాయింపుల గురించి మాట్లాడతవా అని దుయ్యబట్టారు. ఆ నాడు ప్రగతి భవన్ లో ఎమ్మెల్యే లకు గులాబీ కండువా కప్పి చేర్చుకున్న వెధవ ఎవరు అన్నారు. ఆ నాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి ప్రలోభపెట్టి, బెదిరించి చేర్చుకున్న సన్నాసి ఎవరు..? ఆ నాడు విపక్ష శాసనసభ్యులతో రాయబారాలు నడిపి ప్రగతి భవన్ కు తీసుకుపోయిన వెధవన్నర వెధవ ఎవరు అని ప్రశ్నించారు. రోజుకో ఎమ్మెల్యే ను చేర్చుకుని చివరకు విలీనం అంటు పచ్చి అబద్ధాలు చెప్పిన దగాకోరులు ఎవరు., పార్టీలకు పార్టీలను మింగేసి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అని నంగనాచి కబుర్లు చెపుతావా అని మండిపడ్డారు. పదేళ్ల పాటు నువ్వు, నీ అయ్య ప్రదర్శించిన అతి తెలివిని తెలంగాణ జనం చూశారన్నారు. తెలంగాణలో సిగ్గు, లజ్జ, మర్యాద లేని బతుకులు కల్వకుంట్ల కుటుంబానివి అని, ఫిరాయింపుల బాగోతాలు రాష్ట్ర ప్రజలకు తెలుసని, ఇప్పటికైనా సుద్దపూస ముచ్చట్లు ఆపాలన్నారు. అయినా కోర్టు పరిధిలో ఉన్న అంశంపై పదేపదే మాట్లాడడం సరికాదన్నారు.

**ఛీత్కరించినా బుద్ధి రాలేదు..**

ప్రజలు ఛీ తక్కరించినా రోజు ఏదో ఒక వంకతో మీడియాలో కనిపించాలని తాపత్రయం పడుతున్నారన్నారు. సొల్లు వాగుడు ఆపాలని, లోక్ సభ ఎన్నికల్లో జీరో చేసినా బుద్ధి రాలేదన్నారు. తెలంగాణలో వారికి నూకలు చెల్లే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయని, ముఖ్యమంత్రిని ఆడిపోసుకోవడమే దొంగల ముఠా కు పనిగా మారిందన్నారు. పదేళ్లు వాళ్లు చేస్తే సంసారం.. పక్క వాళ్ళు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఉప ఎన్నికలు వస్తాయని మాట్లాడుతున్నావు గానీ, ఇప్పటికే వచ్చిన ఎన్నికల్లో నువ్వు చేసింది ఏమిటన్నారు. అసెంబ్లీలో ఓడించాం, పార్లమెంట్ లో చిత్తు చిత్తు చేశాం.. కంటోన్మెంట్ బై ఎలక్షన్ నిన్ను అడ్రస్ లేకుండా చేశాం.. ఉప ఎన్నికలు వస్తే నిన్ను, నీ పార్టీ ని అడ్రస్ లేకుండా చేస్తామని కేటీఆర్ పై ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా కేటీఆర్ మాట్లాడేటప్పుడు నాలుక, ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని హితువు పలికారు.





# రైల్వే ట్రాక్ కుట్రలపై అప్రమత్తంగా ఉన్నాం

**కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్**

**జైపూర్:** ఇటీవల కాలంలో రైల్వే ట్రాక్‌లపై ఎల్పీజీ సిలెండర్లు, ఇనుపరాడ్లు పెట్టి రైలు పట్టేలు తప్పేలా జరుగుతున్న కుట్రల ఘటనలపై రైల్వే శాఖ అప్రమత్తమైంది. ఇలాంటి ఘటనలపై తాము అప్రమత్తంగా ఉ న్నట్టు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇలాంటి ఘటనలపై రైల్వే శాఖ అప్రమత్తంగా ఉంది. రాష్ట్ర ప్రభు త్వాలు, డీజీపీలు, హోం శాఖ కార్యదర్శులతో చర్చలు జరుపుతున్నాం. ఎన్ఐఏ కూడా భాగస్వామ్యమైంది. ఇ లాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జైపూర్‌లో మీడియాతో మాట్లాడు తూ చెప్పారు. రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)తో పాటు స్థానిక పోలీస్ స్టేషన్లతో అన్ని రైల్వే జోన్ల అధికారులు కలిసి పని చేస్తున్నారని చెప్పారు. ఎన్ఐఏ పాత్ర గురించి మంత్రి మరింత వివరణ ఇవ్వలేదు.

**వరుస ఘటనలు**

రైలు పట్టాలపై గ్యాస్ సిలెండర్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు వంటి వస్తువులు కనిపించిన పలు ఘటనలు ఇటీవల కాలంలో చోటుచేసుకున్నాయి. సెప్టెంబర్ 22న గూడ్స్ రైలు ప్రయాగ్‌రాజ్ నుంచి కాన్పూర్ వెళ్తుండగా పట్టాలపై గ్యాస్ సిలెండర్ కనిపించడంతో డ్రైవరు ఎమర్జెన్సీ బ్రేక్ వేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇదే తరహా ఘటన సెప్టెంబర్ 15న జరిగింది. కాళింది ఎక్స్‌ప్రెస్ కాన్పూర్‌లో ఆగడానికి కొద్ది నిమిషాల ముందు పట్టాలపై డ్యామేజ్ అయిన సిలెండర్, ఇతర వస్తువులు ఉండటాన్ని కనుగొన్నారు. సెప్టెంబర్ 21న ఉత్తరప్రదేశ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఫిష్ ప్లేట్లను ఓపెన్ చేసి పారిపోయారు. కీమెన్ అప్రమత్తం చేయడంతో రైళ్ల రాకపోకలను కొద్దిసేపు నిలిపేశారు. పట్టాలు తప్పేందుకు కుట్ర పన్నారనే ఆరోపణపై గత మంగళవారంనాడు ముగ్గురు రైల్వే ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేసారు. మరో ఘటనలో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో భటిండా–ఢిల్లీ మార్గంలోని రైలు పట్టాలపై తొమ్మిది ఇనుప రాడ్లు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com